

# సగటు చంద్రుడు

చాగంటి శంకర్

కొందరికి ఎక్కాలు ఎంచక్కా వేగంగా వస్తాయి. మెదడులోని తీగలు లెక్కల చిక్కుకీగాలంతా తగులుకుని విప్పి బయట పెడతాయి. నాకు చిన్నప్పుడు లెక్కలసలు వచ్చేవి కావు. భయంకరంగా దెయ్యాల్లా కనిపించేవి. ఆల్జీబ్రా గాబరాగా ఉండేది. సగటు లెక్కలు వెగటుగా ఉండేవి. సగటు లెక్కలు బుర్ర కెక్కని నన్ను సగటు మనిషిగా చేసింది కాలం! సగటు ఆనందాన్ని మాత్రమే ఇచ్చింది దేశం. తరవాత నాకు తెలిసింది సగటు లెక్కలు రాని చాలా మంది సగటు మనుషులుగా లేరని, నాకే కాదు— ఏ దేశ నాయకుడికీ ఏ సంస్కర్తకీ సగటు లెక్కలు రావు. సగటు జీవితం అర్థం కాదు. సగటు జీవితంలోని సున్నితత్వం, సంస్కారం బుర్ర కెక్కవు.

రాజ్యం నాతో ఎనిమిదేళ్ళు సంసారం చేస్తూన్న నా భార్య కాదు ఎనిమిదేళ్ళు సంసారం చేస్తున్న సంస్కారం. కామేశ్వరి—ఇద్దరు పిల్లలతో సంతోషంగా కాపరం చేస్తున్న నా చెల్లెలు కాదు కన్యాదానం నాన్న చేసినా, పెళ్ళి నేను చేశానన్న సంతృప్తి. రాధ బి. ఎస్సీ. ఫైనలు చేస్తున్న నా చెల్లాయి కాదు ఎదిగి పోయిన బాధ్యత. గోపీ, రాములు? నా కొడుకుల్లాంటి తమ్ముళ్ళు కారు—మా అమ్మా నాన్నల వైవాహిక జీవితంలోని చిట్ట చివరి కక్కుర్తులు. బేబి? ఎంతో ప్రయత్నించి, ప్రయత్నించి ఆపినా, ఆగక, ఈ లోకంలోకి నాచే తేబడ్డ అయిదు నిమిషాల ఆవేశం. అమ్మా, నాన్నలు. వారికే కందమూలాలూ, ఫలాలూ కోసుకోనీయని ఈ లోకంలో, ఆశ్రమం కట్టుకోనీయని ఈ దేశంలో వానప్రస్థం చేస్తున్న వృద్ధులు. నాకు రూపాన్నీ, లోకాన్నీ బహుమానం చేసిన పూజ్యులు. నేను ఎవరో ఎవరూ చెప్పలేరు. పదేళ్ళుగా ఆఫీసుకీ, ఇంటికీ నడుస్తూన్న మాంసం ముద్దని. అద్దంలో ఆకారాన్ని చూసుకుంటూన్న అహాన్ని! "రాజశేఖరం" అని ఎవరైనా అంటే, "ఆ" అని వెనక్కి తిరిగి చూసే ఆకారాన్ని. బాధా, ఆనందం, కోపం, ప్రేమా ఇంకా ఏమిటేమిటో ఎన్నెన్నో ఫీలవుతున్న "మనిషిని" అని అనుకుంటూన్న మనిషిని.

మనిషిని గెంతక పోయినా, మనసు గెంతుతూంటే నిన్న ఇల్లు చేరాను. సైకిలు వరండాలో పెట్టి, నే సావిట్లో కెళ్ళేసరికి నాన్న "పదమూడో ఎక్కం రాదురా వెధవా" అని గోపీని తిడుతున్నారు. "మా అన్నయ్య టైమ్‌లో ఉద్యోగాలకి వేట లేదు. ఈ రోజుల్లో బుర్ర పెట్టి చదివి, పాసుకాకపోతే అడుక్కు తినాలిసిందే" అన్నారు మళ్ళీ. అమ్మ చత్వారం కళ్ళజోడు పెట్టుకుని బియ్యం ఏరుతూంది. రాధ సీరియస్‌గా చదువుకుంటుంది. "అన్న వచ్చాడు" అన్నాడు రాముగాడు టార్చిలైటు బాగు చేస్తూ, నన్ను చూస్తూ, తెచ్చిన పొట్లాం విప్పి టేబిలు మీద పెట్టాను. "అందరూ రండి" అని పిలిచి పొట్లాన్ని అమ్మ చేతి కిచ్చాను.

"ఏమిటి విశేషం?" అడిగారు నాన్న.

"బోనస్ వచ్చింది"

"కింద పడి, మీద పడి మొత్తానికిచ్చా రన్న మాట" అన్నారు నాన్న కోవా నోట్లో వేసుకుంటూ.

"ఆ, ఇచ్చారు, యిన్ఫ్లేషనని, ఇవ్వరని హడిలి చచ్చాం."

రాజ్యం కోవా నోట్లో వేసుకుని వంటింట్లో కెళ్ళిపోయింది చిరునవ్వునీ, దాంట్లో కొండంత అర్థాన్నీ నా మీద విసిరేసి.

"మొత్తం ఎంతొచ్చిందిరా?" అనడిగింది అమ్మ.

"రెండు వేల అయిదువందలు".

"పోన్లే, కొంతలో కొంత! రాధ అదృష్టవంతురాలు" అని రాధ వైపు చూస్తూ అంది అమ్మ.

రాధ సిగ్గు పడుతూ వెళ్ళి పుస్తకం తీసుకుంది. నా గొంతుకలో పచ్చి వెలక్కాయ పడింది! రాధని చూస్తూంటే, నాలుగేళ్ళ క్రితం కామేశ్వరి పడ్డ 'సిగ్గు' గుర్తొచ్చింది. సవ్యంగా కామేశ్వరి పెళ్ళి జరగడం, రెండు పురుళ్ళు పొయ్యడం అయ్యాయి. కామేశ్వరి రెన్యూవల్ చేస్తూన్న ఖర్చు నుంచి నిన్ననే తేరుకున్నాను. ఇవాళ బోనసు వచ్చింది. ఇవాళే రాధ సిగ్గు పడుతూంది. బంగారం లాంటి రాజ్యం నన్నెప్పుడూ బంగారం అడగ లేదు. రాజ్యాని కిచ్చిన చీరల్లో మంచివన్నీ రాధే కడుతుంది. "కాలేజీ కెళుతూన్న పిల్ల, నేనే కట్టుకోమన్నాను. ఇంట్లో ఏడ్చేదాన్ని నే నెలా ఉంటేయేం?" అంటూంది రాజ్యం. అలాటి రాజ్యం పెళ్ళయిన మరునాడు నన్నడిగిన ఒక కోరికకి ఇప్పుడు ఎనిమిదేళ్ళు వచ్చాయి. ఆ కోరిక పెంకిగా తయారై, మాట వినడం మానేసింది. బోనస్ వచ్చాక ఆ కోరిక తీరుస్తాననీ, ఈ సారి మాత్రం ఖాయం అనీ అన్నాను. అందుకే ఎంతో సంతోషంగా ఇంటి కొచ్చాను. కాని అమ్మ అన్న మాటకి నాకు ఏమనాలో అర్థం కాలేదు. నిజమే, అమ్మ సబబుగానే అన్నాది. కొంతలో కొంత వచ్చింది డబ్బు. మరో కొంత అప్పు తెచ్చి రాధ పెళ్ళి అయిందనిపించుకోవచ్చు. కాని రాజ్యం?

రాత్రి పడుకునేటప్పుడు అంది రాజ్యం "అత్తగారు చెప్పినట్లే చెయ్యండి. ఆవిడన్నదే న్యాయం. రాధ పెళ్ళికి దాగుండా డబ్బు. కుదరగానే చేసెయ్యొచ్చు" అని.

"సరి పోతుందేంటి ఈ డబ్బు? ఎలాగూ అప్పు చేస్తాం, ఏకంగా అంతా అప్పుడే చెయ్యొచ్చు. ఇప్పుడు మాత్రం మనం అనుకున్నట్లూ చేద్దాం" అన్నానే కాని మనస్ఫూర్తిగా అన్న మాట కాదది!

"సరిపోకపోయినా చేసే అప్పు తగ్గుతుందిగా? అత్తగారు చెప్పినట్లే చెయ్యండి. ఇప్పు డింక ఆ పని తల పెట్టడం మానుకోండి" అన్నది రాజ్యం. అన్నాదే కాని రాజ్యంకూడా మనస్ఫూర్తిగా అన్నమాట కాదది! రాజ్యం కళ్ళంట వచ్చీ రాని నీళ్ళు కనిపించాయి. అవి బయటికి రాకుండా కళ్ళే వాటిని మళ్ళీ లాగేసుకున్నాయి.

"బాధ పడుతున్నావా?"

"అబ్బే బాదేం లేదు. ఇది సంసారం" అంది రాజ్యం.

* * *

ఇవాళ నా మనసంతా అదోలా ఉంది. అకస్మాత్తుగా ఒక నిర్ణయాని కొచ్చాను. ఒక వెర్రి ఆలోచన

నన్నొ ఒడ్డుకి చేర్చింది. కళ్ళున్నట్లు కాళ్ళు ఇంటికి నడిచాయి. మంచం మీద కూర్చుని "రేపు పొద్దున్న నేనూ, రాజ్యం సింహాచలం వెళుతున్నాం" అని అమ్మా, నాన్నా వినేలా డిక్లేర్ చేశాను.

"నేనూ వస్తా నన్నయ్యా" అంది రాధ.

"నీకు పరీక్షలేవూ?"

నా వాక్యం విని, "అవును రాను" అన్నట్లు మొహం పెట్టింది రాధ.

"హఠాత్తుగా ఇప్పుడా ప్రయాణం ఏమిట్రా?" అనడిగింది అమ్మ.

"బోనస్ వస్తే సింహాచలం వెళదామనుకున్నాను, అంతే."

"మంచి బుద్ధే పుట్టిందా బుర్రకి. బేబీనికూడా తీసుకెళ్ళండి" అంది అమ్మ.

"దానికి పడిశం పట్టింది. గాలి మంచిది కాదు".

రాజ్యం ఏమీ మాట్లాడలేదు. 'ఏమిటీ సింహాచలమా?' అని ఆలోచిస్తూ ఉండి ఉంటుంది. నాన్న ఎప్పుడూ తటస్థం. తమ్ముళ్ళకి వద్దామని ఉన్నా, అడగడానికి భయం! ఏదయితేనేం, రాజ్యం, నేనూ మరునాడు పొద్దున్న బయలుదేరాం.

"మా ధనరావుగారు కనిపిస్తే ఉండమని ప్రాణాలు తీస్తాడు. రాత్రి మేమ్ వచ్చాకే వంట వండండి, ఒక వేళ రామేమో" అన్నా వెళుతూ వెళుతూ.

"అలాగేలెండి, ఉండి పోతే, రేపు భోజనాల వేళ కొచ్చేయండి" అంది అమ్మ.

"ఆ ఆ'.

"ప్రసాదం మా కందరికీ పట్రండి" అంది రాధ.

"అలాగే. టేబిలు మీద లీవు లెటరు రాసి పెట్టాను. గోపీగాడ్ని ఆఫీసు కెళ్ళి వచ్చేమనండి" అని బయట పడ్డాను రాజ్యంతో.

ఇల్లు వదిలి బయట పడ్డాక నా కాళ్ళ కున్న తాళ్ళను విప్పేసుకుని నడుస్తున్నట్లున్నాది. నా నెత్తి మీంచి ఆకాశాన్ని దింపేసినట్లయింది. తేలిగ్గా రాజ్యంతో ఎగిరి పోతున్నట్లున్నాది. "మీ వాలకం నా కేం అర్థం కాలేదు. రాత్రి నా క్కూడా ఎంత అడిగినా చెప్పలేదు. ఈ సింహాచలం ప్రయాణం ఏమిటి?" అని అడిగింది రాజ్యం.

"అర్థం అవుతుంది. మనం సింహాచలం కాదు వైజాగు వెళుతున్నాం' అన్నాను రాజ్యం కళ్ళలోకి చూస్తూ.

"వైజాగా? దేనికి?" అనడిగింది రాజ్యం.

"ఎవ్విరి డాగ్ హేజ ఇట్ డే ఇవాళ నా రోజు! ఈ వేళ ఏం తోస్తే అది చేద్దామనుకున్నా. వైజాగ్ వెళ్ళాలని తోచింది. వెళుతున్నా."

"పనీ పాటా లేకుండా ఎందుకు వెళ్ళడం?" అంది రాజ్యం.

"పనీ పాటా ఉండాలనేం ఉంది? నీకు బీచి, సెవెంటీ ఎం. ఎం. హాలు, పరిగెడుతూన్న జనం అంటే ఎం తిష్టమో నాకు బాగా తెలుసు!"

బస్సులో రాజ్యం చిన్న పిల్లలా నిద్ర పోయింది. రాజ్యాన్ని చూస్తే నాకు జాలేసింది. ఎన్నిమి దేళ్ళు జైల్లో పెట్టాను రాజ్యాన్ని. ఒక ఇరుకు గదిలో ఇన్నేళ్ళుఉంది. కోరికల్ని ఆశల్ని నేను ఇరుకు చేసేశా.

వైజాగు చేరాక డబుల్ రూమ్ తీసుకున్నాం. ఏ. సి. రూము కాకపోయినా, డీసెంటుగా ఉంది రూము. "నాకంతా ఏదోలా ఉంది" అంది రాజ్యం నేను పరుపు మీద కెగిరి పడి ఈల వేస్తూంటే.

"ఏమీ ఉండదు. గుండెల గదుల్లో ఇంకెవరూ ఇంకేదీ లేకుండా మనిద్దరం ఈ గదిలో ఈ సిటీలో ఇవాళ ఉందామని తీసుకొచ్చాను. నువ్వు హాస్యం చేసినా నిరుత్సాహ పరిచినా నాకు కోపం వస్తుంది. అన్నా బ్రీఫ్ కేసుని ఓపెన్ చేస్తూ. పువ్వుల చీర, తెల్ల పేంటూ, తెల్ల షర్టూ బయటికి తీశాను. షాంపూ, సోపూ, టవలూ రాజ్యాని కందిస్తూ "తలంటుకుని రా" అన్నాను.

"మంచి వెర్రిలే" అని బాత్ రూమ్ కెళ్ళింది రాజ్యం.

బెల్లు నొక్కి బాయ్‌ని పిలిచాను. రెండు కాఫీలు, విల్స్ ఫ్లేక్ ఫిల్టరు కింగ్ పాకెట్టూ పట్టుకు రమ్మన్నాను. హుషారుగా నేను కూని రాగాలు. తీస్తూంటే తల తుడుచుకుంటూ రాజ్యం వచ్చింది రాజ్యంతోపాటూ షాంపూ వాసన, సబ్బు వాసనా వచ్చాయి. "ఆహా, బాగుంది" అన్నా.

"ఏమిటి?"

"వాసన" అన్నా నీళ్ళు కారుతూన్న రాజ్యం జుత్తుని వాసన చూస్తూ. "నేనూ స్నానం చేసి వస్తా" అని బాత్ రూమ్ కెళ్ళాను. షవర్ జల్లు తూన్న నీళ్ళతో ఇరవై నిమిషాలు ఆడుకున్నా. నే గదిలో కొచ్చేసరికి పువ్వులచీర కట్టుకుని జుట్టార బెట్టుకుంటూ కూర్చుని ఉంది రాజ్యం.

"ఈ పువ్వుల చీరలో నిన్ను చూస్తూంటే ఆ పువ్వులు నీకు పూశాయనిపిస్తోంది నాకు."

"పువ్వులు నాకు పుయ్యలేదు. మీ కళ్ళకి కాయలు కాశాయి. మీరు వాచి పోయారు" అని నవ్వింది రాజ్యం.

ఆ నవ్వులోకూడా నాకు పువ్వులే కనిపించాయి.

"నిజమే, నేను వాచి పోయాను!" అన్నా తెల్ల షర్టూ పేంటూ టక్ చేస్తూ.

"అరరె, ఎంత పనైంది. మన పాత అల్మారా తాళం, పెట్టెల తాళాలు అన్నీ కట్టు కొచ్చేశాను. పొద్దున్న పిల్లి వస్తే అల్మారా తాళం నేనే వేశాను. ఇప్పుడేం చెయ్యడం? వాళ్ళేం చేస్తారు? బేబీకి పాలు?" అంది రాజ్యం తాళాల గుత్తిని చూపిస్తూ.

"ఏదో చేస్తారులే" అని తాళాల గుత్తిని వెనుక జేబులో వేసుకుని.

"నే నెలా ఉన్నా?" అనడిగా రాజ్యాన్ని, టకప్‌ని సర్దుకుంటూ.


"మందార మొక్క జొన్న పొత్తులా" అని నవ్వింది రాజ్యం.

"నీకు ముందే చెప్పాను—హాస్యం చెయ్యొద్దని."

"హాస్యంకాదు, నిజమే! తలంటుకుంటే మిమ్మల్ని చూడలేం. సగం తెల్ల వెంట్రుకలూ, సగం నల్ల వెంట్రుకలూను. ఆరనీండి జుత్తు, చూపిస్తాను."

ఉన్నది ఉన్నట్లు చెపితే అలాగే ఉంటుంది.

"జుత్తెలా ఉంటే యేంలే. నే తెల్ల జత టక్ చేస్తే బాగుంటావని నువ్వెప్పుడూ అంటావు. అందుకే అర్థ రాత్రి దాన్ని వెతికి మరీ పెట్టాను బ్రీఫ్‌కేసులో. ఇప్పుడేమో నువ్విలా అంటున్నావు."

"సారీ అండీ. బాగున్నారు. బాగా లేరని కాదు. మన వయస్సుని మనం దాచుకోలేం. నా నడుం మీది ముడతల్ని నేను మాత్రం దాచుకో గలనా? నా ఒళ్ళుని సన్నం చేసుకోగలనా నాజూకుతనం పోయి నాకు ఒళ్ళు వచ్చేసింది. కుర్రతనం పోయి ముద రా తయారయారు మీరు ఏం ఉంటాం"

"ఏం కాదే,నువ్వు బాగున్నావు. నేను బాగున్నాను" నా లాగ నువ్వు చూడగలగాలి. అప్పుడు నేనూ నీకు అలాగే కనిపిస్తాను.'

"సరె ఇద్దరం బాగున్నాం. మీరేదో పూహించు కొని బాధపడుతున్నట్లున్నారు."

"నా బాధల్లా ఒకటే. ముప్పదిగిన దాన్ని పదేళ్ళ సర్వీసు చేసినా తీర్చలేకపోయాను. అది నా తప్పా చెప్పు? చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యాలి. తమ్ముళ్ళకి చదువులు చెప్పించాలి. పెద్దవాడిగా పుట్టడ పాపమా? మంచిగా ఉండడం పాపమా?" అన్నా ఆవేశంగా.

బోయ్ కాసీలు తేవడంతో రాజ్యం మాట్లాడ్డం మాని కాఫీ తీసుకుంది. నేను కాఫీ తాగి సిగరెట్టు వెలిగించి, గట్టిగా దమ్ము లాగాను. ఒక అరగంట పైగా సోడ్లు తిరిగి, ఎ.సి. హోటలు కెళ్ళి స్పెషల్ మీల్ తిన్నాము. తాంబూలాలు వేసుకొని సినిమాకి వెళ్ళాము.

"ఈ హోటళ్ళలోనూ, సినిమా హాళ్ళలోనూ జనాన్ని చూస్తే ప్రపంచంలో బాధే కనిపిస్తుంది. నవ్వుతూ, గెంతుతూ కనిపిస్తారంతా. దేశంలో పేదరికం ఉందా అని అనుమానం వస్తుంది!" అన్నా.

"సినిమాలకీ, షికార్లకీ బాధల్ని మర్చిపోడానికే వచ్చేది! మీరు నన్ను ఇక్కడికి తీసుకొచ్చినట్లు" అంది రాజ్యం.

చల్లగా సినిమా చూశాము. ఆటోలో బీచి కెళ్ళాము. రాకన్నా ముందే బీచికొచ్చి ఉన్నాడు చంద్రమామ! ఎవరూలేని చోటుకెళ్ళి అలసిపోయేలా గెంతాన్నేను. రాజ్యాన్ని ఎత్తుకొని సముద్రంలోకి తీసుకెళ్ళాను, అలలు కాళ్ళని కోరేస్తుంటే కాచు కుంటూ. రాజ్యం బరువుకి భయమేసి, ఒడ్డు కొచ్చేసి ఇసకలో రాజ్యాన్ని కుదేశాను. "అబ్బ, నడుం విరిగిందండీ" అంది రాజ్యం నడుంమీద చేతులు పెట్టుకుంటూ. "నేనేమీ చిన్నపిల్లను కాను, మంచాన పడ్డావంటే మీ బాధలు చూడాలి."

"ఈవేళ నేనంతే. ఏం చేసినా 'నో'లు లేవు."

"మంచి మ్రేరేగాని, తాళాలకి వాళ్ళెంత ఇబ్బంది పడుతున్నారో కదా?" అంది రాజ్యం. రాజ్యం అలా అనగానే నాకేదో ఆవేశం వచ్చింది. ఒళ్ళు మండింది. జేబులోంచి తాళాల గుత్తిని తీసి సత్తా వరూనా సముద్రంలోకి విసిరేశాను

"అర్రెరె ఎంతపని చేశారు! తాళాలు విసి రేస్తారా?? ఛ! మీకు నిజంగానే పిచ్చిపట్టి నట్లుంది"

"లేపోతే, నీకు పాత అల్మారా, అందులో పెనుగు, బొద్దింకలూ తప్ప ఎదురుగా ఉన్న సముద్రం, చంద్రుడూ కనపించవ్!"

రాజ్యం ఏమీ మాట్లాడకుండా మొహం తిప్పు కొని కూర్చుంది. సముద్రం, చల్లగాలి, తెల్లగా పువ్వుపువ్వులా వెన్నెల, చందమామ, లైట్‌హౌసు లైటు, సముద్రంతో సమ్మగా, ఎర్రగా వెలుగుతూ బీకన్ లాంప్స్ ఎదురుగా పెట్టుకొని రాజ్యం అలక! "తాళాల గురించి మర్చిపోగాని, చూడు ఎంత బావుందో సముద్రం" అని రాజ్యాన్ని కౌగిలించు కున్నా. చంద్ర కిరణాల్ని సముద్ర కెరటాలు ముక్కలు ముక్కలుగా కోస్తున్నాయి—నా గుండెల్ని ఆలోచనలు కోస్తున్నట్లు. ఈ తియ్యని చంద్రుడి కోసం, వాడెదురుగా బాధా బందీలేని ప్రణయం కోసం రాజ్యం కలలు కన్నాది. బస్తాడు బొండు మల్లెలు పరచిన పానుపు, తరవాత మాచింగ్ డ్రెస్సులతో జలపాతాలముందూ, పంట చేలల్లోనూ, కొండ గుహల్లోనూ పాటలు పాడుకోవాలని అందరికీ అనిపించినట్లే రాజ్యానికీ! అందమైన ప్రాంతాలకి వెళ్ళాలనీ, వాటిన్నీ నాతోపాటు చూడాలనీ!! జీవో వాట్లు బల్బున్న ఇరుకు గదిలో ఎనిమిదేళ్ళుగా ఉంది గాని, విశాల ప్రపంచాన్ని చూడలేదు! రాజ్యాన్ని ఒకటే అడుగుదామనిపించింది.

"మనం ఇక హనీమూన్‌కి వెళ్ళలేము. నన్ను క్షమించు" అని.

"హనీమూన్ గురించి మీరింక మర్చిపోండి. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేశారని అంతా ప్రయోజకు డన్నారు. మీ కా తృప్తి చాలదా? ఇప్పుడు మనం వెళ్ళకపోతే కొంపలు మునిగిపోవు. ఇవాళొచ్చేంగా ఇక్కడికి?"

నిజమే ఇవాళొచ్చాం ఇక్కడికి ఎనిమి దేళ్ళలో మేం ఇద్దరం కలిసి చేసిన రెండు గంటల ప్రయాణం చంద్రుడు వెన్నెల్తో సముద్రాన్ని కలికితే కెరటాల నురుగు వెన్నలా వస్తోంది. తీసి పట్టుకెళదామనిపిస్తోంది. నేనూ, రాజ్యం, నా హృదయంలోని పోరూ, సముద్రమూ, సముద్రం హోరూను ఈ ఏకాంతాన్ని వదిలి వీధుల్లో పడిచేస్తుంటే హెచ్చు తగ్గులూ, బాధలూ, బాధ్యత లూను మనిషి సంఘజీవే అయినా సంఘంలో మనిషి మామూలు బతుకు బతకలేడు. ప్రతిమనిషి ఏదో ఒక రంగు పూసుకునే బతుకుతాడు. ఆ రంగు వెలిసిపోకుండా ఉండాలని నిత్యమూ అలసిపోతూ ఉంటాడు. కలల్నీ, ఆశల్నీ కాల్చుకునైనా ఆ రంగును కాపాడుకుంటాడు.

ఆలోచనల్ని గట్టుకట్టి ఆపుతూ, అలా ఆ బీచిలో ఆ ఇసకలో మేం ఇద్దరం వాలిపోయేం. వాస్తవంలో కొచ్చి రాజ్యం కళ్ళని చూశాను. సూర్యకాంతిలోకి చంద్రుడు వెన్నెల్నిస్తే, చంద్రకాంతిలోంచి రాజ్యం కళ్ళు చల్లని దీపాలై నాకు మనశ్శాంతినిస్తున్నాయి. వెన్నెల వెలుగులో మా ఇద్దరికీ సిగ్గేసింది! ఎనిమి దేళ్ళు సంసారం చేశాక ఇలా తీసుకున్న కోరికని ఏమనాలి? నాకు పువ్వుల చీర, రాజ్యానికి తెల్ల జత టక్కున్న కనిపించాక మాకు నవ్వొచ్చింది!!

"ఏమిటండీ ఆ మెరుస్తూన్నది?" అనడిగింది రాజ్యం దేన్నో చేత్తో చూపిస్తూ.

"మనకి నిధి దొరికింది!" అన్నా వెన్నెల్లో అందంగా మెరుస్తూన్న దాన్ని చూస్తూ.

దగ్గర కెళ్ళి ఇద్దరం చూశాను.


"నిధికాదు మీరు విసిరేసిన తాళాలగుత్తి!!" అంది సంబరపడుతూ దాన్ని తీసుకొని ఇసకని దులుపుతూ.

"కాదు, మన సగటు మనుషులు విసిరేసినా, మనల్ని పట్టుకొని వదలని బాధ్యత!!" ★

సూపర్ బాల్ పెన్....
హాయిగా, మెత్తగా రాసేది.

కేమ్లిన్
121 జాటర్

లక్షలాది ప్రజల అభిరుచులకు అనువుగా ఉండేలా రకరకాల రంగులలో దొరుకుతుంది. ఈ ధరలో దొరికే బాల్ పెన్‌లలో దీనిని మించినది మరేది ఉంటుంది!




S 786 Tel